ప్రజాశక్తి

శనివారం 18 నవంబర్ 2023 5 విజయనగరం



కులగణనపై 18న రౌండ్ టేబుల్ సమావేశం

కుల సంఘాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 27 నుంచి వారం రోజులపాటు కులగణన సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీచేసిందని, ఈ సర్వేపై వివిధ కులాలకు చెందిన కార్పొరేషన్ డైరక్టర్‌లు, కుల సంఘాల పెద్దలకు ఈ సర్వేపై అవగాహన కల్పించి వారి నుంచి తగిన సూచనలు, సలహాలు స్వీకరించే నిమిత్తం ఈనెల 18న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ తదితర ప్రభుత్వ సంక్షేమ శాఖల అధికారులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

పదునెక్కిన పోక్సో

వరుస శిక్షలతో బెంబేలెత్తుతున్న నిందితులు

ప్రజాశక్తి-విజయనగరం

పోక్సో కేసుల్లో నిందితులకు పోక్సో ప్రత్యేక న్యాయస్థానం వరుసగా శిక్షలు ఖరారు చేయడంతో కోర్టు విచారణకు హాజరవుతున్న నిందితుల వెన్నులో వణుకు మొదలయ్యింది. 2023 సంవత్సరంలో ఇప్పటి వరకు 8 పోక్సో కేసుల్లో నిందితులకు కోర్టు శిక్షలు విధించడం వెనుక కేసుల్లో పోలీసు అధికారుల దర్యాప్తు, సాక్ష్యాలు సేకరణ, సాంకేతిక నైపుణ్యం, ప్రాసిక్యూషను విచారణపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం, కేసులను నిరంతరపర్యవేక్షించి, సమీక్షించడం వంటి అంశాలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. గతంలో పోక్సో కేసులు నమోదైనప్పటికీ న్యాయస్థానాల్లో విచారణలో జాప్యం తలెత్తేది. నేడు పోక్సో కేసులను ప్రాసిక్యూషను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు, పోలీసు వాదనలను వినిపించేందుకు ప్రత్యేకంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకాలు జరగడంతో సత్ఫలితాలిస్తున్నాయి. ఈ ఏడాది 8 పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షపడగా, వాటిలో ఐదు కేసుల్లో నిందితులకు 20 సంవత్సరాలకు పైబడి జైలు జీవితం అనుభవించే పరిస్థితులు ఏర్పడ్డాయి.

జిల్లాలో ఇటీవల నిందితులకు శిక్ష పడిన పోక్సో కేసుల వివరాలు

- దిశ మహిళా పోలీసు స్టేషనులో 21.9.2021 న నమోదైన పోక్సో కేసులో గంట్యాడ మండలం కొర్లాం గ్రామం కారు చిన్నారావు (33)కు 20సంవత్సరాలు జైలు శిక్ష, రూ.16వేలు జరిమానా జైలు విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం ఏప్రిల్ 21న తీర్పు వెల్లడించింది.
- గంట్యాడ పోలీసు స్టేషనులో 10.10.2019న నమోదైన పోక్సో, అట్రాసిటి కేసులో నిందితుడైన గంట్యాడ మండలం కొండతామరాపల్లికి చెందిన సారిపల్లి చిన్నారావు (65)కు 20ఏళ్ల జైలుశిక్ష, 2వేల జరిమానా విధించారు.
- విజయనగరం 1వపట్టణ పోలీసు స్టేషనులో 24.6.2022న నమోదైన పోక్సో కేసులో నిందితుడైన శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం మండలం పెద్దసీది గ్రామానికి చెందిన ధర్మాన ప్రసాద్ అలియాస్ రుషికుమార్ (20)కు 20సంవత్సరాలు జైలు, రూ. 20వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది.
- విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో 2018లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన విజయనగరం పట్టణం లంకాపట్నంకు చెందిన పొడుగు అరవింద్ (22)కు 3ఏళ్ల జైలుశిక్ష, రూ.1500 జరిమానా కోర్టు విధించింది.
- బొబ్బిలి పట్టణ పోలీసు స్టేషనులో 2019లో నమోదైన పోక్సో కేసులో కంచరవీధికి చెందిన విక్రమ్ యేసు (34)కు నాలుగేళ్ల జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పునిచ్చింది.
- బొబ్బిలి పోలీసు స్టేషనులో 2021 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన బొబ్బిలి మండలం మెట్టవలసకు చెందిన అడబాల సతీష్ (23)కు 2ఏళ్ల 3నెలలు జైలు, రూ.1500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.
- బొబ్బిలి పట్టణ పోలీసు స్టేషనులో 2019లో నమోదైన పోక్సో కేసులో బొబ్బిలి మండలం పాతపెంటకు చెందిన గిరడ లక్ష్మణకు 23 ఏళ్ల ఆరు నెలలు జైలు శిక్ష, రూ.11, 500 జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెల్లడించింది.
- చీపురుపల్లి పోలీసు స్టేషనులో 2018లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన గరివిడికి చెందిన కాకర్లపూడి రాంకుమార్ వర్మ (24)కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ ఈనెల 16న కోర్టు తీర్పు వెల్లడించింది.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్
- నిరవధిక దీక్షలకు ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలు పరిష్కరించేవరకు పోరాడుతామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ అధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరవధిన నిరాహారదీక్షలు చేపట్టారు. దీక్షలను రాష్ట్ర కార్యదర్శి ఎ. అశోక్ ప్రారంబించారు. పలు ప్రజాసంఘాల నాయకులు దీక్షలకు మద్దతు తెలిపారు. దీక్షలను ఉద్దేశించి అశోక్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగానే ఉన్నాయని తెలిపారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర రావు మాట్లాడుతూ విజయనగరంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని , కానీ అవి ఈ నగర పాలకులకు పట్టకపోవడం దౌర్భాగ్యమని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి. సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యారంగం పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం నిరాహార దీక్షలు చేసిన సందర్భంగా విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తే నేటి వరకు ప్రభుత్వం నెరవేర్చ లేదన్నారు. సమస్యల పరిష్కారం కాకపోతే విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం రుచి చూడక తప్పదని అన్నారు. దీక్షకు మద్దతు తెలిపిన శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.లక్ష్మి మాట్లాడుతూ పాఠశాలల విలీనం ద్వారా అనేకమంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోయారని ,దీనికి కారణమైన ఎన్ఇపిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతుంటే దున్నపోతు పై వర్షం పడుతున్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. నిరవధిక నిరాహార దీక్షలో కూర్చున్న వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి. రామ్మోహన్, జిల్లా సహాయ కార్యదర్శి జె. రవి కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పి. రమేష్, కె. రమేష్, ఎస్.సమీరా, నాయకులు వి.భారతి, కె. డేవిడ్ ఉన్నారు. దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో కెవిపి ఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ ఉన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు దీక్షా శిబిరం వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు.

దీక్షలకు మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

దీక్షా శిబిరం వద్ద నిద్రిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జనసేనలో బయటపడ్డ విభేదాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపితో కలిసి సమన్వయంతో పని చేసి అధికారంలోకి రావాలని అనుకుంటున్న జనసేన నాయకుల మధ్య విబేధాలు బట్ట బయలవుతున్నాయి. గురువారం టిడిపి, జన సేన ఆత్మీయ సమావేశం అందుకు నిదర్శనం. టిడిపితో సమన్వయం విషయం పక్కన పెడితే ముందు జనసేనలో సమన్వయం అవసరమని విమర్శలు వినిపిస్తున్నాయ. జిల్లా కేంద్రంలో జనసేన ముఖ్య నాయకుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, మరో ప్రధాన నాయకుడిగా ఉన్న గురాన అయ్యలు మధ్య సఖ్యత లేదు.. సమన్వయం లేదు అనడానికి గురువారం జరిగిన సమావేశానికి గురాన అయ్యలకు సమాచారం లేక పోవడమే. ఇటీవల చంద్రబాబు అరెస్టు విషయంలో టిడిపితో కలిసి జరిగిన ఆందోళనల్లో జనసేన ఇచ్చిన ఇచ్చిన కార్యక్రమాలను జిల్లా కేంద్రంలో గురాన అయ్యాలు విస్తతంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కుటుంబ బలం ఉండటంతో పాటు, కొంత కేడర్ కూడా ఉంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న పాలవలస యశస్విని ఆయనను కలుపుకొని వెళ్లడం లేదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించి, ఇంటింటి ప్రచారం చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న యశస్విని గత ఎన్నికల లో ఇదే నియోజకవర్గంలో పోటీ చేసిన విషయం తెలిసిందే. ఎవరు ఎప్పటి నుంచి పార్టీలో ఉన్నా నాయకత్వంలో ఉన్న వారందరినీ కలుపుకొని వెళ్లాల్సిన సమయంలో తలోదారి పట్టడం పట్ల పార్టీ శ్రేణులు తీవ్ర ఆవేదన చెందుతున్నాయి. మరో వైపు ఇటీవల నియోజకవర్గ ఇన్‌ఛార్జీల నియామకం కూడా విబేధాలకు దారి తీస్తున్నట్లు తెలుస్తుంది. గజపతినగరం, నెల్లిమర్ల వంటి నియోజకవర్గాల్లో నియోజకవర్గ ఇంఛార్జి నియామకాల వల్ల కొంతమంది సీనియర్లు అలిగినట్లు తెలిసింది. గజపతినగరం నియోజకవర్గంలో ఇటీవల జనసేనలో చేరిన మాజీ మంత్రి పడాల అరుణ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నారనే ప్రచారం సాగుతోంది. నాయకుల మధ్య ఉన్న విబేధాలు సరి చేస్తారా లేదా అనేది త్వరలో అధిష్టానం వద్ద జరిగే పంచాయతీలో తేలనుంది.

అన్నదాతకు అండగా ఉంటాం

- నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి
- జిల్లా వ్యవసాయ సలహా మండలి తీర్మానం
- కరువు నిబంధనలు వర్తించవు : జెడి రామారావు

ప్రజాశక్తి-విజయనగరం

అన్నదాతకు అండగా నిలవాలని, పంట నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి నిర్ణయించింది. ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలోని వర్షాభావ పరిస్థితులు, రబీకి నీటి సరఫరా, చెరకు మద్దతు ధర, ధాన్యం కొనుగోలు ప్రక్రియ తదితర అంశాలపై, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, బొబ్బిలి ఎంఎల్‌ఎ శంబంగి వెంకట చినప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

జిల్లాకు కరువు నిబంధనలు వర్తించవు

జిల్లాలో ఈ ఏడాది సుమారు 2,32,586 ఎకరాల్లో ఉబాలు జరిగాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు చెప్పారు. అయితే వర్షపాతం లోటు కారణంగా ఇప్పటికే సుమారు 9,221 ఎకరాల్లో పంట ఎండిపోయిందని, మరో 24,332 ఎకరాల్లో ఎండిపోయేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కరువు నిబంధనలను వివరించారు. వర్షపాతం లోటు 19 శాతం కంటే తక్కువ నమోదైనప్పుడే కరువు పరిస్థితి వర్తిస్తుందని తెలిపారు. సెప్టెంబరు 30 నాటికి జిల్లాలో 9 శాతం లోటు మాత్రమే నమోదయ్యి ందని, తేమ శాతం, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నా, జిల్లాలోని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించేందుకు అవకాశాలు లేవని చెప్పారు. అయినప్పటికీ కొద్ది రోజుల్లో జిల్లాలో కేంద్ర బృందం పర్యటిస్తుందని, ఏమైనా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని చెప్పారు.

సలహా మండలి ఛైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పండిన చోట అత్యధిక దిగుబడి వస్తుందని, మరికొన్ని చోట్ల పూర్తిగా నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని అన్నారు. జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పంట నష్టపోయిన రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని కోరారు. వారికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా నిబంధనలను సడలించాలని, ఈ మేరకు మండలి తీర్మానం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, పంట దెబ్బతిన్న ప్రాంత రైతుల ప్రయోజనాలకు విఘాతం కల్గకుండా పంటకోత నమూనాలను నిర్వహిస్తామని, రైతులకు బీమా పరిహారం వచ్చేలా చేస్తామని చెప్పారు.

చెరకు ధర నిర్ణయం వాయిదా

జిల్లాలో చెరకు పంటకు మద్దతు ధర నిర్ణయాన్ని వాయిదా వేశారు. భీమసింగి చక్కెర కర్మాగారం పరిధిలో సుమారు 11వేల టన్నులు, ఎన్‌సిఎస్ పరిధిలో 90 వేల టన్నులు చెరకు దిగుబడి వస్తుందని కేన్ కమిషనర్ వివరించారు. చెరకు కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిన సంకిలి సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు చెప్పిన ధరలను జెడ్‌పి ఛైర్మన్, జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఎ శంబంగి అంగీకరించలేదు. రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా ధరలను, ఇన్సెంటివ్‌ను పెంచాలని కోరారు. దీనిపై వచ్చే సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, అందరి అభిప్రాయాలను తీసుకొని మద్దతు ధరను ఖరారు చేయాలని నిర్ణయించారు.

రబీకి నీళ్లిచ్చే పరిస్థితి లేదు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లోను దృష్టిలో పెట్టుకొని రానున్న రబీకి సాగునీటిని అందించే పరిస్థితి లేదని తోటపల్లి, మడ్డువలస, తాటిపూడి రిజర్వాయర్ల ఇంజనీర్లు స్పష్టం చేశారు. కొన్నిచోట్ల ఖరీఫ్ లోనే నీళ్ల తగినంతగా ఇవ్వలేకపోయామని చెప్పారు. రబీకి నీటి విడుదల విషయంలో ముందే స్పష్టమైన ప్రకటన చేస్తే, రైతులు ప్రత్యామ్నాయ పంటలను వేసుకుంటారని సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు కోరారు. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, రానున్న రోజుల్లో జిల్లా తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జెడ్‌పి ఛైర్మన్ సూచించారు. దీనిపై వీలైనంత త్వరగా నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించి తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.

ప్రతీ ధాన్యపు గింజా కొనుగోలు చేస్తాం

జిల్లాలో పండిన ప్రతీ ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేపట్టిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెలాఖరుకు ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. ప్రతీ వాహనానికి జిపిఎస్ ఉంటుందని, అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కూడా కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. కొనుగోలుకు చేస్తున్న ఏర్పాట్లను సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఓటర్ల సవరణ ప్రక్రియలో

ఫారం 6,7,8లను ప్రాసెస్ చేయాలి

- 18,19 ఏళ్ల ఓటర్ల సంఖ్య పెరగాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల సవరణ ప్రక్రియలో వచ్చిన ఫారం 6,7,8 లను వెంటనే ప్రాసెస్ చేయాలని, 10 నుండి 15 రోజుల మధ్య లో డిస్పోజ్ చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. 15 రోజులు దాటి పెండింగ్ ఉన్నవారికి నోటీసులను జారీ చేస్తామని అన్నారు. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో శుక్రవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫారం 6,7,8 క్లెయిమ్ ల పరిష్కారం, ఓటర్ల జనాభా నిష్పత్తి, ఎపిక్ కార్డుల జనరేషన్, వార్తా పత్రికల్లో వచ్చిన ప్రతికూల వార్తల పై చర్యలు తదితర అంశాల పై సమీక్షించారు. దరఖాస్తులు అంది 30, 45 రోజులు దాటి పెండింగ్ ఉన్న ఫారాలను సోమవారం లోగా క్లియర్ చేయాలని ఆదేశించారు. రిజెక్ట్ కొట్టిన వాటికీ సహేతుకమైన కారణాలను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

18, 19 సంవత్సరాల ఓటర్ల సంఖ్య జిల్లాలో తక్కువగా ఉందని, అర్హత గల యువకులు ఇంకా 6800 మంది ఉన్నారని, వారిని గుర్తించి ఓటర్లు గా చేర్పించాలని తెలిపారు. వచ్చే 10 రోజుల్లో ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఓటర్ల తొలగింపు, నమోదు మరీ ఎక్కువగాను, తక్కువగాను ఉన్న చోట ఎఇఆర్‌ఒలు వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని పర్యవేక్షించాలని తెలిపారు. వచ్చే వారంలో రోల్ అబ్జర్వరు శ్యామల రావు జిల్లాలో పర్య టించ నున్నారని, బిఎల్‌ఒలు వారి వద్ద ఉన్న రిజిస్టర్ లన్నీ అప్‌డేట్ చేసు కోవాలని తెలిపారు. డిసెంబర్‌లో 2 రోజులు పాటు ఎన్నికల కమిషన్ అధికారులు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ అనిత, ఇఆర్‌ఒలు వెంకటేశ్వర రావు, సుధారాణి, నూకరాజు , ఎన్నికల విభాగం ఎఒ శ్రీకాంత్, డిటిలు పాల్గొన్నారు.

18 ఏళ్ళు నిండిన వారందరిని ఓటర్లు గా చేర్పించాలి

అంతకు ముందు కలెక్టర్ వెబెక్స్ ద్వారా అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్ళ తో మాట్లాడుతూ , 18 ఏళ్ళు నిండిన యువతను ఓటర్లు గా చేర్చడానికి ఎన్నికల కమిషన్ 4 కట్ ఆఫ్ తేదీలను ఇచ్చిందని తెలిపారు. 1 జనవరి 2024 , 1 ఏప్రిల్ 2024, 1 జూలై 2024, 1 అక్టోబర్ 2024 నాటికీ 18 ఏళ్ల నిండుతున్న వారంతా ఓటర్లుగా చేరేందుకు అర్హులేనని, వారందరినీ గుర్తించి ఓటర్లు గా చేర్పించడానికి దరఖాస్తులను అందజేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

వరల్డ్‌కప్ ఫైనల్ కోసం భారీ స్క్రీన్లు

జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్‌ఎన్ రాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 19న ఇండియా-ఆస్ట్రేలియా మధ్య జరుగనున్న ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రజలంతా తిలకించేందుకు వీలుగా నగరంలో పలుచోట్ల భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం ఎల్ ఎన్ రాజు తెలిపారు. నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ సమీపం, భాష్యం స్కూల్ పక్కన గల గ్రౌండ్‌లో భారీ ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ భారీ ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారపు. క్రికెట్ ప్రేమికులు, క్రీడాకారులు, ప్రజలు, క్రీడాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని భారత్ క్రికెట్ జట్టు విజయానికి మద్దతు అందించాలని కోరారు.

మహిళా పార్కులో బిగ్ స్క్రీన్

ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్ ను మహిళా పార్కులో వీక్షించేందుకు భారీ స్క్రీను ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. శుక్రవారం మహిళా పార్కులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్ తిలకించేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలని తెలిపారు. క్రికెట్‌ను తిలకించేందుకు ప్రత్యేకంగా టెంట్లు, కుర్చీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మ్యాచ్‌లో భారత జట్టు సిక్స్‌లు కొట్టే సమయంలో డ్రమ్స్ వాయిద్యాలతో మరింత ఉత్సాహభరితంగా భారత జట్టుకు ప్రోత్సాహాన్ని ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మ్యాచ్ తిలకించేందుకు మాత్రం మహిళలందరికి పూర్తి ఉచితంగా ప్రవేశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్క్ నిర్వహణ కమిటీ సభ్యులు ఉమా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వరిచేను కుప్పలు వేస్తున్న రైతులు

తుపాను హెచ్చరికతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో పలు గ్రామాల్లో ఇప్పటికే వరి పంట కోతలతో బిజీగా ఉన్న రైతులపై తుపాను వార్త పిడుగులా పడింది. ప్రస్తుతం ఆకాశం మబ్బులు వేయడం, చిన్న చిన్న వర్షపు తుంపర్లు పడడంతోపాటు వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వారంలో కోసిన వరిచేను ఎండకుండా కుప్పలుగా పెడితే కుళ్లిపోయే ప్రమాదం ఉందని, అలాగని వదిలేస్తే వర్షానికి తడిచి పంట మొలకలు వచ్చేస్తుందని భయాందోళన చెందుతు న్నారు. కొంతమంది రైతులు కోసిన పంటలను చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎండకుండా కుప్పలు పెట్టడం వల్ల పెట్టిన పెట్టుబడి కూడా రాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

ఎస్‌పి దీపిక పాటిల్

ప్రజాశక్తి-రామభద్రపురం

జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా వర్గాలను నియమించినట్లు ఎస్‌పి దీపిక పాటిల్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీలు చేపట్టారు. ముందుగా స్థానిక అంధుల పాఠశాల, భవిత కేంద్రాల్లో చదువుతున్న వికలాంగ విద్యార్థులతో మమేకమై, వారితో ముచ్చటించారు. వారికి సొంత నిధులతో దుస్తులు, పళ్లు పంపిణీ చేశారు. వారికి విద్యాబోధన చేస్తున్న కొల్లి ఈశ్వరరావు, రాజేశ్వరిని అభినందించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ పరిశీలించారు. అనంతరం ఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, కక్షి దారులకు సమన్యాయం అందించేలా సిబ్బందికి సూచనలు చేస్తున్నామని తెలిపారు. పోక్సో కేసుల నమోదుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇంతవరకు 8 కేసులు బనాయించి నేరస్తులకు శిక్షలు పడేలా చేశామని వివరించారు. తరచూ నేరాలు చేస్తున్న వారిపై రౌడీ షీట్లు తెరుస్తున్నామన్నారు. కుటుంబ తగాదాలు శాంతియుతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు జారీ చేశామన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం క్రైమ్‌రేట్, రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ఇది తమ సిబ్బంది తరచుగా చేస్తున్న ఆకస్మిక తనిఖీల ఫలితమేనని స్పష్టంచేశారు. మద్యం గొలుసు దుకాణాలు, బహిరంగ మద్యపానం నివారణకు కృషిచేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా సిబ్బంది కొరత ఉందని, త్వరలో జరిగే నియామకాలతో పూర్తి స్థాయిలో ప్రజా రక్షణకు సహకరిస్తామని తెలిపారు. సచివాలయ మహిళా పోలీసుల సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఈ పోలీస్ స్టేషన్‌ను సిఐ, ఎస్‌ఐ, సిబ్బంది శ్రమదానం, కొంత సొంత నిధులు సమకూర్చుకొని యుద్ధ ప్రాతిపదికన అందంగా తీర్చిదిద్దిన తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీధర్, సిఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్ర నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్‌పి దీపిక పాటిల్

మౌనికను అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రపంచ టెన్నికాయిట్ పోటీలో మౌనికకు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో ఇటీవల ముగిసిన 5వ ప్రపంచ టెన్ని కాయిట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మన దేశం తరపున పాల్గొని స్వర్ణ పతకం సాధించిన జట్టులో సభ్యురాలిగా వున్న జిల్లాకు చెందిన క్రీడాకారిణి రెడ్డి మౌనికను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అభినందించారు. డబుల్స్ విభాగంలో ఋామె కాంస్య పతకం సాధించింది. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధిస్తూ జిల్లాకు ఖ్యాతిని తీసుకు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కోరాడ ప్రభావతి మౌనికను అభినందిస్తూ అందజేస్తున్న రూ.25వేల నగదు ప్రోత్సాహకాన్ని కలెక్టర్ ద్వారా ఇచ్చారు. కార్యక్రమంలో కోచ్ మత్స్య రామారావు, మీసాల శ్రీనివాస రావు, శివప్రసాద్, గౌరీశంకర్, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందన

ఈనెల 4 నుంచి నాలుగురోజులుపాటు గోవాలో జరిగిన 37వ నేషనల్ గేమ్స్ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీల్లో మన రాష్ట్రం తరపున విజయనగరం జిల్లా నుండి పి.నరసయ్య (ముంజేరు), ఎల్.సురేశ్(లోగిస)పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రం బ్రాంచ్ మెడల్ సాధించింది. ఈనేపథ్యంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా ఖోఖో క్రీడాకారులు, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి చింత సత్యనారాయణ, ట్రెజరర్ మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపాల్, కె.ప్రభావతి, కలిశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తైక్వాండో జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 18,19తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరగబోయే సబ్ జూనియర్ కేడెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ త్వైక్వాండో ఛాంపియన్ షిప్ కు విజయనగరం జిల్లా నుండి 34 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన. అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు యశస్విని, గగన్, చైతన్య విజయంతో తిరిగిరావాలని అభినందనలు తెలిపారు.

దళితులపై దాడుల నివారణలో విఫలం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దళితులపై దాడుల నివారణలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని ఎస్‌సి, ఎస్‌టి ఐక్య వేదిక నాయకులు కనిగిరి శ్రీనివాసరావు, టి.నరసయ్య ఆరోపించారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ దళిత యువకుడు బొంత మహేంద్రను పోలీస్ స్టేషన్లో హింసించి మృతికి ప్రభుత్వం కారణమైందని తెలిపారు. దళిత యువకుడు మృతికి కారణమైన కొవ్వూరు ఎస్ఐ భూషణం, వైసిపి నాయకులు ముదునూరి నాగరాజు, బల్లుల సతీష్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. హోంమంత్రి సొంత నియోజకవర్గంలో దళితులకు న్యాయం జరగకపోతే మిగతా ప్రాంతాల్లో ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు.

జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొనేందుకు వెళ్తున్న కె.డేవిడ్‌కు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కె.మణికుమార్, నాయకులు కిరణ్, సాయిమణి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి చేరిన సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి-బొబ్బిలి

కైకలూరుకు చెందిన టిడిపి అభిమాని, వికలాంగుడైన పోతుల రాఘవేంద్ర ఒంటికాలితో ఈ నెల 8న ఒడిశా సరిహద్దు వరకు చేపట్టిన సైకిల్‌యాత్ర గురువారం రాత్రి బొబ్బిలి పట్టణానికి చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ బేబినాయన.. కోటలోకి ఆయన్ను ఆహ్వానించారు. సైకిల్‌యాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దారి ఖర్చుల నిమిత్తం కొంత నగదును ఆయనకు బేబినాయన అందించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులే

రేగిడి : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని లచ్చన్నవలస జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు ఎన్‌లేజర్‌తో బ్రీతింగ్ తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. అతివేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శివ, సిబ్బంది ఉన్నారు.

ఆస్తిపన్ను వసూలు ముమ్మరం

విజయనగరం టౌన్ : ఆస్తిపన్ను వసూలును ముమ్మరం చేసి లక్ష్యాలను అధిగమించాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు ఆదేశించారు. శుక్రవారం 14, 16, 49 నెంబరు సచివాలయాలకు చేరుకుని ఆస్తి పన్ను వసూళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల పరిధిలో ఉన్న ఆస్తిపన్ను వివరాలను తెలుసుకున్నారు.

నేటి నుంచి బైరెడ్డిపాలెంలో గడపగడపకు..

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని బైరెడ్డిపాలెం సచివాలయ పరిధిలో శనివారం నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సచివాలయ పరిధిలోని రెడ్డికంచేరు, పిన్నింటిపాలెం, గాబువానిపాలెం గ్రామాల్లో శనివారం కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 19న బైరెడ్డిపాలెం, బమ్మిడిపేట గ్రామాల్లో నిర్వహిస్తామని వెల్లడించారు. 19వ తేదీ మధ్యాహ్నం నుంచి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఇదే సచివాలయ పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బిల్లులు చెల్లించక..
రోడ్డు పనులు పూర్తికాక

ఆతవ జంక్షన్ నుంచి వేసిన రోడ్డులో తేలిపోయిన రాళ్లు

అర్థాంతరంగా నిలిచిన రహదారి పనులు

బొద్దాం జంక్షన్ నుంచి ముకుందపురం వెళ్లే రోడ్డులో గొయ్యి

గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణాలకు గ్రహణం పట్టింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపేశారు. రహదారి పనులు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అర్థాంతరంగా పనులు నిలిపేసిన రోడ్లపై క్వారీ లారీలు, భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

- ప్రజాశక్తి, వేపాడ

- వేపాడ మండలంలో సోంపురం జంక్షన్ నుంచి ఆనందపురం కూడలి వరకు 16 కిలోమీటర్ల రోడ్డు పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నాయి. నిధులు మంజూరైనప్పటికీ చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడం మధ్యలో కాంట్రాక్టరు రోడ్డు పనులు నిలిపేశారు. క్వారీ లారీలు అధిక లోడుతో తిరగడం వల్ల రోడ్డు నిర్మాణానికి వేసిన మెటల్ తేలిపోతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది.

- వీలుపర్తి రోడ్డు నుంచి కడకొండకు సుమారు కిలోమీటర్ వరకు వేసిన పక్కా రోడ్డు బూడిదగా మారిపోయింది. నిధులు మంజూరైనట్లు చెప్పడమే తప్ప పనులు మాత్రం చేపట్టకపోవడంతో గిరిజన గ్రామాల ప్రజలకు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

గోతిలోనుంచి వెళ్తున్న మినీ వ్యాను

- మండల ప్రధాన రహదారి నుంచి ఆతవ గ్రామానికి వెళ్లే రెండు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఎమ్మెల్యే గ్రాంట్ నుంచి నిధులు మంజూరుకావడంతో కాంట్రాక్టరు పని ప్రారంభించారు. రోడ్డు వేసేందుకు మొత్తం చదును చేశారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పని నిలిపివేశారు. రోడ్డుపై రాళ్లు తేలిపోవడంతో విద్యార్థులు, ప్రజలు రోడ్డుపై ప్రయాణం సాగించడానికి నరకం అనుభవిస్తున్నారు.

- విశాఖపట్నం నుంచి శృంగవరపుకోట మీదుగా అరకు వెళ్లే హైవే నుంచి ముకుందపురం గ్రామానికి ఉన్న సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర రోడ్డు గోతులమయమైంది. ప్రమాదకరంగా గోతులు ఏర్పడటంతో ఈ రోడ్డుపై ప్రయాణించడానికి ముకుందపురం, ఓబులయ్యపాలెం గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. మరోవైపు రోడ్లన్నీ గోతులమయం కావడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు సైతం బెంబేలెత్తిపోతున్నారు.

ప్రతి వాహనానికీ జిపిఎస్ తప్పనిసరి

ఎడి శ్యామసుందర్

ట్రాక్టర్‌కు జిపిఎస్ అమర్చుతున్న ఎడి శ్యామసుందర్

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ధాన్యం తరలించే ప్రతి వాహనానికీ జిపిఎస్ తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అలజంగి, కారాడ గ్రామాల్లో వాహనాలకు జిపిఎస్ యంత్రాలను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వ్యవస్థలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి సంబంధిత మిల్లుకు చేరవేసే ప్రతి వాహనానికి జిపిఎస్ పరికరం ఉండాని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధాన్యం రవాణా కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, వాహనాలకు జిపిఎస్ పరికరాలని అమర్చడం తప్పనిసరి అన్నారు. రైతు సొంతఖర్చుతో ఏర్పాటు చేసుకుంటే జిపిఎస్ పరికరం ఖరీదు రూ.2,470 అని, సివిల్ సప్లై కార్పొరేషన్ అమర్చితే రూ.2,920 అవుతుందన్నారు. మండలంలో ఇప్పటివరకు 72 వాహనాలకు జిపిఎస్ పరికరాన్ని అమర్చినట్లు తెలిపారు. గతేడాది బొబ్బిలి మండలంలో ధాన్యం రవాణా కోసం 396 వాహనాలను ఉపయోగించినట్లు చెప్పారు. మిగతా వాహనదారులు కూడా ఈ పరికరాన్ని అమర్చించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

విజయనగరంకోట.. ర్యాలీలో పాల్గొన్న గ్రంథాలయ పరిషత్తు సభ్యులు మహేష్‌బాబు, అధికారులు, సిబ్బంది; కొత్తవలస.. పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ భీమశంకరరావు

గ్రంథాలయాల సేవలు ప్రజల్లోకి

ప్రజాశక్తి-విజయనగరం కోట

గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలలోకి తీసుకువెళ్లడమే గ్రంథాలయ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని వారోత్సవాల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు జీను మహేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ముందుగా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని పౌర గ్రంథాలయ శాఖ సహాయ సంచాలకులు వి. రవికుమార్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాచార విప్లవం డిజిటల్ రూపంలో విస్తరిస్తున్నందున ప్రతి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో గ్రంథాలయంలో ఉన్న ఇ-గ్రంథాలయ సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి కార్యదర్శి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో గ్రంథాలయం ప్రారంభం

కొత్తవలస : కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని శుక్రవారం ప్రిన్సిపల్ భీమశంకరరావు ప్రారంభించారు. అకడమిక్ పరంగా విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు పోటీపరీక్షలకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. గ్రంథాలయ అధ్యాపకులు అల్లూరి పద్మావతి అకడమిక్ పుస్తకాలు, పోటీపరీక్షలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అనేక రకాల పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గాలు ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ విజయనగరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బి.గణేశ్వరావు, పి.రామకృష్ణ ఎన్నికయ్యారు. శుక్రవారం యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం గురజాడ పబ్లిక్ స్కూల్‌లో జరిగింది. ఈసందర్భంగా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డి. శ్రావణ మార్, అధ్యక్షులుగా బి. గణేశ్వరరావు, కార్యదర్శిగా పి.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా. రాజేష్, కోశాధికారిగా వి. హరికుమార్, అప్పలసత్యం ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా పి. రామకృష్ణ, కె. గణేశ్వరరావు, జి శౌరీష్, ఎ.రామలక్ష్మి, పి.గీతా స్రవంతి, కె.శ్రీనివాసరావు, తిరుపతిరావు, ఆర్. శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, బిఎస్ఎన్. పైడిరాజు, ఎ.సూర్య సత్యవతి, మండల కమిటీ సభ్యులుగా జి.వరహాలు, పి.నీరజ, ఎల్‌వి మూర్తి , ఎవి బంగార్రాజు, పి.సింహాచలరావు, ఎం. శ్రీనివాస్ కుమార్, ఎం.పద్మావతి, ఎం.దక్షిణామూర్తి, సిహెచ్. విమల, పి.కృష్ణ, ఎం. ప్రసాదరావు, బి. మోహనావు, సిపిఎస్ కన్వీనర్‌గా పి. వెంకటరావు ఎన్నికయ్యారు.

యుటిఎఫ్ జామి మండల కార్యవర్గం..

జామి : యుటిఎఫ్ జామి మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని భీమసింగి వద్దనున్న శ్రీ బాలాజీ కాలేజీలో యుటిఎఫ్ జామి మండల కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ ను పునరుద్ధరించాలని, జిఒ నంబర్ 117ను రద్దు చేయాలని తీర్మానించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే వారి తరుపున యుటిఎఫ్ పోరాటాలు ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

రామకృష్ణ, గణేశ్వరరావు

నూతన కార్యవర్గం వీరే..

యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా కొత్తలి వెంకట్రావు, అధ్యక్షులుగా వి.వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.తాతంనాయుడు, సహాధ్యక్షులుగా ఐవి రమణ, ఎం.రూపవతి, కోశాధికారిగా బి.శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా ఎస్.ముత్యాలు, ఎంవిఎస్ నారాయణ, కె.మురళి, కె.కృష్ణ, ఎస్.అబ్దుల్లా, పి.రామలింగేశ్వరరావు, పి.అప్పలరాజు, పి.మాధవి లత , పి.లక్ష్మణ, టివై వెంకటరావు, ఆలేటి అరుణ, ఆర్.సుబ్బలక్ష్మి, కంది ఇందుమతి, వి.పైడిపు నాయుడు, కె.ప్రభావతి, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.వెంకటనాయుడు, జి.వెంకటరావు, ఆర్.దేముడు బాబు, వై.శ్యామల, ఎ.రాము, ఎల్.రమేష్ నాయుడు ఎన్నికయ్యారు.

రోడ్డుపై గోతిలో కూరుకుపోయిన లారీ

రోడ్డుపై కూరుకుపోయిన లారీ

● స్తంభించిన ట్రాఫిక్ ● ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి రోడ్డులో లారీ కూరుకుపోయింది. రోడ్డుపై లారీ కూరుకుపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాల రాకపోకలను వంతెనపై నిషేధించారు. భారీ వాహనాలను బాడంగి, తెర్లాం మీదుగా దారి మళ్లించారు. బొబ్బిలి వచ్చే భారీ వాహనాలు గొల్లపల్లి మీదుగా రావడంతో రోడ్డు పాడైపోయింది. రోడ్డు పాడైపోవడంతో భారీ వాహనాలు ఎక్కడికక్కడ కూరుకుపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఫలితంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు బాగు చేయాలని, పారాది నూతన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

లీకులతో తాగునీరు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి

లీకులతో తాగునీరు వృథాగా పోతోంది. పట్టణంలోని చినబజారు జంక్షన్ బలిజిపేట రోడ్డుపై మున్సిపల్ పైపులైన్ లీకవడంతో తాగునీరు వృథా అవుతోంది. లీకైన నీరు రోడ్డుపై ప్రవహించడంతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకులతో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందడం లేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీకులను నివారించి ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

పుట్ట వద్ద పూజలు చేస్తున్న టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ; కుటుంబంతో కలిసి చవితి వేడుకల్లో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గొంప వెంకటరావు, గ్రామస్తులు

గ్రామాల్లో చవితి సందడి

ప్రజాశక్తి-బొబ్బిలి, వేపాడ

నాగుల చవితి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పొలాలు, తోటల్లో ఉన్న పుట్టల వద్ద ప్రజలు పూజలు చేశారు. బొబ్బిలి గెస్ట్ హౌస్‌లో పుట్ట వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన పూజలు చేశారు. వేపాడ మండలం లంకాజోష్యులపాలెంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ కుటుంబ సమేతంగా నాగుల చవితి వేడుకల్లో పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవం ప్రారంభం

వేపాడ మండలంలోని బానాది గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. నాగుల చవితిని పురస్కరించుకొని గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను ఊరేగింపుగా గౌరమ్మ చావిడి వద్దకు తీసుకొచ్చారు. గ్రామంలో మూడు దశాబ్దాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే పౌర్ణమి వరకు టిడిపి మండల అధ్యక్షులుగా గొంప వెంకటరావు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మృతిచెందిన వ్యక్తి

లక్కవరపుకోట సమీపంలో ఉన్న శాంభవి లేఔట్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ నిమిత్తం విశాఖ జిల్లా లంకెలపాలెం సమీపంలోని ఎన్‌టిపిసి పరిశ్రమ నుంచి బూడిద లోడుతో తామరాపల్లి వెళ్లేందుకు రెండు లారీలు బయలుదేరాయి. ముందుగా లక్కవరపుకోటకు చేరుకున్న లారీ మండల కూడలిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహ సమీపంలో ఆగి ఉంది. ఆగి ఉన్న లారీని బుధవారం తెల్లవారుజామున అదేలోడుతో వస్తున్న మరో లారీ బలంగా ఢీకొన్న సంఘటన విదితమే. ఈ ఘటనలో ఢీకొట్టిన లారీ కేబిన్ నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన లారీ క్లీనరును శాంభవి లేఔట్‌లో పడేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలంలో ప్రమాదానికి కారణమైన లారీ ఉంది. ముందుగా అక్కడ నిలిపేసి ఉంచిన లారీ మాత్రం రాత్రికిరాత్రే ఉడాయించడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విఆర్‌ఒ లింగం జ్ఞానేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.ముకుందరావు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, పోస్ట్‌మార్టం నిమిత్తం శృంగవరపుకోట సిహెచ్‌సికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి-తెర్లాం

చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

మండలంలో కునాయివలసలో పవర్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌నే గురువారంరాత్రి దొంగలు చోరీ చేశారు. రైతుల పంపుసెట్లకు విద్యుత్తు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామ సమీపాన అమర్చారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌పై కొన్నేసిన దొంగలు రాత్రి కరెంటు సరఫరా ఆపి ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించారు. గ్రామ సమీపాన ఉన్న ఎబి స్విచ్ ఆపి, ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు దించి, అందులో ముఖ్యమైన భాగాలను తస్కరించి, మళ్లీ యథావిధిగా అమర్చారని ఎలక్ట్రికల్ ఎఇ జోగినాయుడు తెలిపారు. దీని విలువ సుమారు రూ.3.50 లక్షల పైన ఉంటుందన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని రాయుడుపేటలో శుక్రవారం గాడి ముసలయ్య, గాడి అప్పారావుకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో శృంగవరపుకోట నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు చెబుతున్నారు.